# మరపురాని మధురగాథ

(విజయనగర సామ్రాజ్య సామాజిక చారిత్రక అనుశీలన)



మహాకవి సరస్వతీపుత్ర

**పుట్టపర్తి నారాయణాచార్యులు**

**Price : 250.00**

**$:10**

1. నామకరణములు
2. ముందుమాటలు
3. పరిపాలనా విధానము-కేంద్ర ప్రభుత్వము
4. న్యాయము-దండన
5. సైన్యసంపద
6. శ్రీ కృష్ణదేవరాయలు
7. శీగిరిభట్టు
8. విద్యాతీర్థులు
9. భారతీకృష్ణ తీర్థులు
10. భోగనాథుడు
11. విద్యారణ్యులు
12. శృంగేరి
13. మత త్రయం
14. బౌద్ధ జైనాలు
15. విద్యారణ్య
16. వేదాంత దేశికులు
17. కవితార్కిక సింహుడు
18. అనెగొంది
19. పండితుల పాండిత్య విరోధాలు
20. శంకరానంద శ్రీకంఠులు

# 1. నామకరణములు

విజయనగరమునకు వివిధములైన పేరులు, దాక్షిణాత్యులు– 'విద్యానగర' మనుచుండరి. 'విద్య' యని గూడా నామాంతరము, 'ఆనెగొంది', 'కుంజరకోన' యనియు వాడెడువారు. 'హోసపట్టణము' మరియొక నామకరణము. 'విరూపాక్ష పట్టణము' 'హంపి' యనుటయు వాడుక. 'హస్తినావతి' వేరొకపేరు. 1535 నుండి 1563 వరకున్న శాసనములలో దానికి 'విద్యానగరమ'నియే ప్రసిద్ధి. విద్యానగరమునే బుక్కరాయలు– 'విజయనగర' మొనర్చినని నిరూపించుటకు రైస్ మహాశయుడు శక్తివంచన లేక ప్రయత్నించెను. కాని కృతకృత్యుడు గాలేదు. 'విద్యారణ్యులను బట్టి దానికి విద్యానగరమని ప్రసిద్ధి గల్గెననుట పొరపాట'ని సీవెల్ దొరయే దేల్చివేసినాఁనాడు. 'ఆనెగొణ' 'కుంజరకోన' యను రెండు పేరులును విజయనగరమునకు ముందున్న పట్టణమునుగూర్చి వాడఁ బడిన మాట. ఈ పట్టణము తుంగభద్ర కుత్తరమువైపు నుండెను. కాని, రాగరాగ కొన్ని శాసనములలో విజయనగరమునకుఁ గూడా నాపేరు వాడుకలోనికి వచ్చెను. 1413 లో నానెగొంది 'వీరవిజయరాయని'కి ముఖ్యపట్టణము. నేటికిని ప్రజ విజయనగరము 'నానిగొంది' సంస్థానమనియే పిలచును. 1347 నాటికి 'హస్తినాపుర విజయనగరమ'ని పెద్దపేరేర్పడెను. 1404 లో విజయనగరమునకుఁ బూర్వపద్భావముతో 'విజయనగర హస్తినావతి' యనుకొక నామము. 1436 లో దేవరాయల పాలనయం దానగరము 'హంపీ హస్తినావతి'! క్రమముగా 1563 నాటికాపేరు 'హస్తినావతీవిద్యానగరి' యని పూర్వపద్భావముతోఁబాటు గ్రొత్త యాదేశమునుఁ గూడా సంపాదించికొన్నది. 1354–55 నాటికది 'హోసపట్టణము'. అప్పటికి విజయనగరము లేదు.

విదేశరాయబారులీపేరు ననేకావతారము లెత్తించిరి. ముఖ్యముగ – మహమ్మదీయులా నగరమును 'బిస్నగా'యన్నారు. కొందరు 'బిజ్నగర్' యని త్రిప్పిరి. వేఱుకొందరు–లేని ద్విత్వమును దగిలించి 'బీజనుగ్గార్' 'బీజ్నుగ్గార'ని పిలిచిరి. కొందరి పాలికిది నానావిధమై 'బిడ్జనగరైనది'. 'బిచనగర్' మరియొకపేరు. ఇంకొఁకఁడు 'బిజనెగాలియా' యని యెక్కడనో దేల్చివేసెను. ఈ నామకరణ మన్నింటికంటెను మెఱుగైనది.

'బర్బోసా' దీనిని నరసింగ రాష్ట్రమన్నాఁడు. నాఁడు విజయనగరమును బాలించుచున్నది 'సాళువ నరసరాజు'. 1368లో నారంభమైన విజయనగరమను పేరు 'తల్లికోట' యుద్ధానంతరమును 'చెలామణి'లో నుండెను. రాజధాని పాడైన తరువాత నా రాజులు 'చంద్రగిరి'లో నుండిరి. పెనుగొండలో వసించిరి. 'ఆనగొంది'లో 'హంపి'లో నుండిరి. కాని, వారెక్కడనున్నను దాని రాజధాని విజయనగరమనియే జెప్పికొనిరి.

**విజయనగరమునకు ముందు**

విజయనగరమును నిర్మించిన స్థలము దక్షిణదేశ చరిత్రలో నపూర్వమైనది. ఆచోటునకుఁ జుట్టునెన్నియో పౌరాణిక గాథ లల్లికొని యున్నవి. అంతటి యదృష్టము దక్షిణమున నే స్థలమునకు బట్టలేదు. 'విజయనగర' మన్నంతనే రామాయణ కాలమునాటి 'కిష్కింధాపురము' వినీలాకాశమున విద్యుల్లేఖవలె మన హృదయములలో మెఱిసిపోవును. వాల్మీకినాటి 'వైఢూర్య విమలోదక' యైన పంపాసతీ భంగ బాలికలు–తలఁపులను దుసికిళ్ళాడించును. చారిత్రక యుగమందును నా పరిసరము లనామకములుగావు. 'కంపిలి' 'కుంజరకోన' 'కురుగోడు' దవ విక్రమగీతికలలోను విద్యాధరులచే నాలపింపఁ జేసికొన్నవి. నిస్సాణ భయంకరములై–వీరుల రక్తముతో వసంతము లన యనేక యుద్ధములట జరిగెను. నాటి జనులకు విజయనగరము–దాని పరిసరము లన్నంతనే యొక యనిర్వచనీయమైన వీరావేశ ముప్పొంగి వచ్చుచుండెను. అందుకుఁ దగినట్లు 'విజయనగరము'ను శత్రుదుర్భేద్యమై వైభవముతోఁ జిందులు ద్రొక్కెను. శత్రువులనుండి తమ మతము–ధర్మము–సంస్కృతి– వీనిని రక్షించుటకేకైక శరణ్యము 'విద్యానగరమే'నని యాజనులు నమ్మిరి. నమ్ముటయే గాదు–ఆ స్థితి ననుభవించిరి. అందుచే నాటి ప్రజలకు విజయనగర మొక యాత్రాస్థలము. నాటి విదేశయాత్రికులు విజయనగరమును దర్శించుటొక మహాభాగ్యముగా నెంచిరి. నేఁడది పాడు పట్టణము. సముదితమైన మతోన్మాద మద్దానియుసురు దీసెను. రేగుపొదలు క్రిక్కిరిసిన యచ్చోట నిలిచి దాని గత వైభవమును జ్ఞాపకమున కెలయించికొని నిట్టూర్తురు. ఈ సుగుణమున మన కన్నను బాశ్చాత్యులే మెఱుఁగేమో!

ప్రాచీన కాలమున దక్షిణ దేశమందు మూఁడు రాజ్యములు పేరు మోసినవట! వానిలో నొకటి రాక్షసరాజ్యము. దాని ముఖ్య పట్టణము లంక. రెండవది వానరధ్వజ సామ్రాజ్యము. దాని రాజధాని 'కిష్కింధ', మిగిలినది 'విద్యాధర సామ్రాజ్య'మట! దాని ముఖ్యపట్టణము రథనూపుర చక్రవాళ పురము. పేరు పెద్దదైనను ముచ్చటగ నున్నది. 'జైన రామాయణము' లోనివి పైమాటలు. నేటి 'సిలోన్' భాగము లంకకు లోఁబడినది దక్షిణ దేశములోని సముద్రతీర మంతయు రాక్షసపాలితము 'కిష్కింధ' తుంగభద్రా శీకర శీతలిత వాతాంకుర రోమాంచితయై భవలక్ష్మీ కిలికించితము. విద్యాధర సామ్రాజ్య రాజధాని దీని కుత్తరమున నుండినది. మధ్యభారతములోని నేటి 'రత్నపురమే' నాటి విద్యాధర రాజధానియేమో! నాఁడు కిష్కింధ యున్నచోటనే 'విజయనగరము' నెలకొనెను! విజయనగరమువలెనే నాఁడును కిష్కింధ నైదుపర్వతములు జుట్టియుండెనేమో! 'కిష్కింధ' యొక్క గుఱుతులు నేటికిని 'హంపి'లోఁ గనుపించునని కొందరందురు.

విజయనగరము ప్రసిద్ధికి వచ్చుటకు రెండవ కారణ పురషుఁడు విరూపాక్షుఁడు. అతఁడు పంపాదేవి ప్రాణనాథుఁడు. ఈ ప్రదేశమునకు 'బంపా క్షేత్ర'మని పేరు. 'భాస్కరక్షేత్ర'మనుట యుఁగలదు. పంపాసమీపమున 1100 నాటికొక పట్టణముండెనని 'సీవెల్' దెలుపుచున్నాఁడు

కాని యంతకు పూర్వమే యచటనొక నగరముండెనని యూహించుటకుఁ గారణములున్నవి. పశ్చిమ చాళుక్యరాజైన వినయాదిత్యుని శాసనమున 'పంపాక్షేత్ర' మభివర్ణితము. ఈ దాన శాసనము క్రీ॥ శ॥ 689 లోనిది. అది యటనున్న తీర్థమునుమాత్రమే దడవుచున్నది. పట్టణమునుగాదు. దక్షిణదేశమును సాధారణముగాఁ తీర్థప్రాధాన్యముకన్నను క్షేత్రప్రాధాన్యమే యెక్కువ. అందుచేనచట పంపాతీర్థముతోఁ బాటొక గుడియు నుండి యుండును. దాని నాశ్రయించికొని యొక చిన్నయూరును. కనుక వినయాదిత్యునినాటికిఁ 'బంప' యొక చిన్న యూరుగా నుండవచ్చును. పశ్చిమచాళుక్యుఁడైన జగదేక మల్ల జయసింహుని కాలమునకు 'హంపి' యొక నగరముగ రూపొందినది. అతఁడు 'పంపాపురము'నకు వచ్చినట్లొక శాసనము గలదు. పశ్చిమచాళుక్య సేనాధిపతియైన 'మహదేవుని' శాసనములో నిది 'స్వామి పంపా స్థలము'గా బేర్కొనఁబడెను.

విరూపాక్షాలయమునకు సంబంధించిన కొన్ని శాసనములను 'సీవెల్' దొర సంపాదించెను. వానిలో నొకచోట విరూపాక్షాలయము యొక్క ప్రథమ ప్రాకార గోపురము క్రీ॥శ॥ 1199 నఁ దొట్టతొలిసారిగాఁ గట్టబడినట్లును 'బోధయ్యరాయఁడఁను నాతఁడు 'హంపి'ని గుడికి దానమిచ్చినట్లును గలదు. కర్ణాటక చరిత్రలో 'బోదయ్యరాయ'డున్న దొక్కఁ డే. అతఁడు 1371లో 'దుగ్గ' యను చోటనుండి కొంత భూమినేలెను. 'బోధయ్యరాయ'ని కనేక శతాబ్దములముందే విరూపాక్ష దేవళమున్నది. మరియాతఁడు హంపిని గ్రొత్తగా విరూపాక్షునకెట్లిచ్చెనో యూహించుట గష్టమైన విషయము. సంగమసుతులు 1346 నాటికే బ్రసిద్ధులుగదా! "హంపి విరూపాక్షుఁడు దమకులదైవమనియుఁ, తాము హంపికేగాక-కర్ణాటకమునకే యధికారులమనియు" వారు చెప్పికొనిరి. 1199 నాటికి విరూపాక్షాలయమున్నది. నాటి యిమ్మడి రాజమల్లుని సుతుఁడైన 'కురుగోడు చౌదయ్య' తిగకంటి దేవుని కైంకర్యమునకై భూదాన మొసఁగినాఁడు. ఆ సంవత్సరమే యాతని భార్యయైన హేచలయు గుడికి కొన్ని దానములిచ్చెను. వీరు 'ఫణివంశ' జనితులట! హొయిసల రాజులును పంపాపతికి దానములు సమర్పించికొనిరి. 1236 లో హొయిసల సోమేశ్వరుఁడు విరూపాక్షునకు భూదాన మొసఁగెను. ధర్మసముద్ధరణమునకు నడుముగట్టి- సమిద్ధపరాక్రములై కత్తి ఝళిపించి నిల్చుసాహసమును హరిహరాదులకుఁ జేకూర్చిన వీప్రాంతములేనంటిమి. వారాప్రాంతములలోని మహావీరులుఁజూపిన ధైర్యసాహసములను వినిరి. కాకతీయుల విక్రమాగ్ని యా యన్నదమ్ముల కనుల యెదుట ప్రమథనాధుని వలె ఫాలాగ్నివలె భగ్గున మండెను.

'హంపీ' సమీప భూములలోని విక్రమరంగములలో మొదటిది "కురుగోడు", ప్రాచీనకాలమున నిచ్చట 'ఫణివంశరాజు'లుండిరి. పశ్చిమ చాళుక్య చరిత్రలో 'కురుగోడు' వచ్చును. ఎనిమిదవ శతాబ్ది కిదియొక 'ముఖ్యపట్టణము'. అప్పటికే దాని ప్రతాపము, సంపదున్మేషము - జగద్విదతము. దాని యారామశోభ యాశ్చర్యావహము. హొయిసల సోమేశ్వరునకది నేలవీడు.

విద్యానగర రాజుల కుద్రేకముబంచిన మరియొక ప్రదేశము 'కంపిలి'. విజయనగర రాజులకుఁ 'గంపిలి' వంశముతో సంబంధము గల్పుటకు చారిత్రకులెంతయో బ్రయత్నించిరి. 'పరదార సోదర రామనకతె' 'కుమార రామన సాంగత్య' యను రెండుగ్రంథములను నీప్రయోజనమునకై వాడికొన్నారు. వీనిలో హొయిసలరాజచరిత్ర గొంతగలదు. కాని, విజయనగర రాజుల పుట్టుపూర్వోత్తరముల దెలుపుటకివి యంతగా నుపయోగపడవు. 'కంపిలి' పైగ్రంథములలో జెప్పబడినట్లు – పదమూడవ శతాబ్ది నాటిదిగాదు. అది క్రీ॥శ॥ 1022 నాటికే యుండెను. 'నోలంబవాడి' కది రాజధాని. పశ్చిమచాళుక్య రాజైన విష్ణువర్ధన విజయాదిత్యుడు 'నోలంబవాడి' నేలెను. అతనికి 'గంపిలి' నేలవీడు. చోళుల నాటికది మహాప్రసిద్ధము. దానిని జయించుట వారొక గొప్ప ఘనతగ భావించి, యా విషయమును 'జయస్థంభము'పై జెక్కించుకొనిరి. చోళుడైన మొదటి రాజరాజు కంపిలిని దహించినప్పుడు జరిగిన గాథయది. మూడవ బల్లాళున కెవడో రాజొక్క డెదురునడచెను. వానికి గంపిలి రాజొకడు బాసటయేనాడు. ఆయుద్ధమున గంపిలిరాజు జచ్చినాడు. అపుడుబోరాడిన హొయ్యల సేనాలలో భైచయ ధన్నాయకు డొకడు. మరియొకడు సింగయ. ఇంతకును బల్లాళు నెదిరించిన రాజెవరో దెలియదు.

మూడవ ప్రసిద్ధ నగర మానెగొంది. అక్కడి యవార్య విక్రమప్రదర్శనము వారి యెదుటనే జరిగెను. వారందు భాగస్వాములుకూడా. 'ఆనెగొంది'కి మారుపేరు 'కుంజరకోన'. ఇది తుంగభద్ర కెడమవైపున నున్నది. విజయనగర సామ్రాజ్యమున కీ పట్టణము మొదటి రాజధాని. విద్యానగరమును గట్టిన తరువాతను రాజు లప్పుడప్పుడిచట నివసించువారు. కాని పదునెమినిది–పందొమ్మిది శతాబ్దముల నాటికి దీని ఘనత పూర్తిగా దగ్గిపోయినది.

విజయనగర రాజులు ధర్మోద్ధరణమే మా యాదర్శమని జాటికొనిరి. తమ సామ్రాజ్య నిర్మాణమందుకేననిరి. ప్రాచీన నీతిశాస్త్రజ్ఞులు రాజు–ప్రజ–వీరిర్వురు సుఖముగా జీవించుట కేర్పరచిన నియమములను మనఃపూర్వకముగ సాధ్యమైనంత యనుసరింపవలెనను దాహము వారికుండెను. కాని, వారి ధార్మికదృష్టి– సామాన్య జీవితమునే మూలమట్టముగ మార్చివేయు వ్యసనముగ బరిణమింపలేదు. అది 'మొదలుచెడ్డ బేరమగు' నని వారెఱుగుదురు. ఈ విశాలదృష్టి గల వారు వైయక్తిక సామాజిక జీవితములందు ప్రాచీన నియమముల నేవియనుసరించిరో–వేనిని దిగనాడిరో వేనినికాలానుగుణముగ మార్చికొనిరో గమనింతుము గాక.

రాజధాని నెట్టిచోట నిర్మింపవలెనో శుక్రాచార్యులడిట్లు పలికెను. “రాజధాని నిరంతరమును నౌకాయానములతో గిటకిటలాడుచుండవలెను. వృక్షలతాగుల్మములు సమృద్ధిగ నున్న ప్రదేశమే పట్టణ నిర్మాణమునకుదగినది. పాడి పంటల కచ్చట గొదవ యుండరాదు. ఆప్రదేశము పక్షిమృగ సంకులమై మనమును దనియింపవలెను. నీటి యెద్దడి యుండగూడదు. స్వదేశీ విదేశీ వ్యాపారములుకు గావలసినన్ని సదుపాయము లుండవలెను.రాజధాని పరిసరములు సస్యశ్యామలములై కీరకందముల ననుకరింపకున్నచో లాభమేమున్నది?

పశుగ్రాసము సమృద్ధిగా లభింపవలెను. అందుకూ సమీపమున నడవులుండవలెను. రాజధాని నదీతీరమున-లేక సమీపమున నుండుట మంచిది. నౌకాయాన ఝంకారములు లేని రాజధాని నిస్తేజము. చుట్టును గొండలు బరివేష్ఠించి యిుండవలెను. ఇట్టి సమతలమును గమనించి రాజు తన రాజధాని నేర్పాటొన ర్చుకొనవలెను."

శుక్రుడు పలికిన నియమములను జాలవఱకు విజయనగరాధీశు లనుసరించిరి. ఆ నగరమున నెప్పుడును 'అరిగెలు' 'పుట్టి' 'తెప్పలు' మొదలైనవి గొదువలేక యుండెను. కానియున్న దొక్కలోపము మాత్రమే! తుంగభద్రానది సముద్రగామిని గాదు.

ప్రాచీన నీతి శాస్త్రవేత్తలు కొండలు-పర్వతములు-వీని ప్రాధాన్యమును జక్కగా గుర్తించిరి. పర్వతములు దగ్గర నున్నచో ఖనిజసంపత్తి దండిగా నుండునని వారి యభిప్రాయము. అంతేగాదు - యుద్ధ సమయములందవి పెట్టనికోటలై - రాజధానిని రక్షించును. ఆ మహా పట్టణమున కీయానుకూల్యములలో గొదువ లేదు. దాని చుట్టు నైదుకొండలు, గగనేందిరతో గుసగుసలాడు చుండెడివి. వీని నడుమ సంస్కృతీ సర్వస్వమైన యా నగరము. ఆ పుటభేదనము రూపెత్తిన విరూపాక్షుడైనచో - నా పర్వతములు లా జటావాటికి జాంపేయములు. వాని పొడవు సుమా రిరువదినాల్గుమైళ్ళట! ఈ పర్వత వలయమునకు లోపల నచ్చటచ్చట మరికొన్ని చిన్న గుట్టలు. ఈ కొండల నడుమనే గొంతసమతలమున్నచో - లేక పర్వతముల యెత్తు దక్కువైనచో-నా రాజులక్కడ నంబరమును చుంబించు కోటలు నిర్మించి, యా కొండ కీ కొండకు లంకె వేయుచుండిరి. ఈ రీతి వారు గొండలో మార్గముల నన్నిటిని గప్పివేసినారు. రాజు తీర్పాటొనర్చిన బాటలలో దప్ప దక్కినవానిమూలమున నెవ్వడును బట్టణము లోనికి బ్రవేశించుటకు సాధ్యమేగాదు.

"అబ్దుల్‌రజాక్" విద్యానగరమును గూర్చి యిట్లు లిఖించెను: "ఆ కోట చక్రాకారముగ నున్నది. పర్వత శిఖరముపై నది యుండెను." 'వర్తిమా' గూడా-"విజయ నగరము పర్వతములకుబక్కన నున్నదనియు, దాని చుట్టుకొలత యేదుమైళ్ళ" నియుజెప్పెను. "ఆదృశ్యము జూచుటకు-హృదయాహ్లాదిగ నుండెను. చల్లటి గాలి స్వచ్ఛందముగ వీచెడిది". ఇవియును 'వర్తిమా' వ్రాతలే! ఆ పర్వతశ్రేణి గగనేందిరతో సరసము లాడుచుండెనని 'నికోలో డి కౌంటీ' వ్రాతకు వ్యాఖ్య.

రాజధానికి చుట్టు నడవులుండవలెననియు శుక్రుని మరియొక నీతి. ఆ పట్టణమును నెటుజూచినను కొట్టరువులు ఆ సంస్కారియైన పండితుని మనోభావములవలె నిరంతరము నిండుగ నుండెడివి. ధాన్యము-గడ్డి-పశువుల పెంపకమునకు గావలసిన యితర సౌకర్యములు నచ్చట సమృద్ధిగానుండెను.

'పైయస్' యిట్లు వ్రాసినాడు, "ఆ పట్టణ మితరముల వంటిది గాదు. వేఱుచోటులలో పదార్థము లితర చోటులనుండి వచ్చుట కనుకూలములు దక్కువ. వచ్చినవానిని బదిలపఱుచుటకు మార్గములను దక్కువయే. విజయనగరమున నట్లుగాదు. ఇచ్చట

ప్రతిపదార్థమును గావలసినంత దొరుకును. పెరుగు-నూనె లెక్క లేనంతగా దినము నమ్ముచుందురు. ఎనుములు-గోవులు మొదలైనవి సమృద్ధిగ బెంపబడును. ఇట్టి పట్టణమును-మరియొక దానిని జూచుటకు మనము చాలా దూరము ప్రయాణించవలెను."

అటవీ సంపదకు గూర్చి 'పైయస్' స్పష్టముగ నేమియు దెల్పలేదు. కాని, 'నిఖితిన్' యిట్లు వ్రాసెను. "ఈ బ్రహ్మాండ పట్టణము చుట్టును మూడు కోటలున్నవి. ఆ నగరము నడుమ నొక నది బ్రవహించును. దాని యొకయొద్దున భయంకరమైన యడవి. వేరొకవైపు ఒకలోయ, ఈ పట్టణము జూచుటకెంత ముచ్చటైనదో - వసించుట కంతటి యనుకూలమైనది".

ప్రాచీనులు సముద్రగామియైన నదికి సమీపమున రాజధాని యుండవలెననుటలో నున్న రహస్యము-స్వదేశ విదేశ వ్యాపారము గూలంకషముగ జరుగవలెననుటయే! ఒకరీతిగ జూచినచో విజయనగరము పర్వతముల నడుమ గట్ట బడుట శుక్రాచార్యుల నీతి నుల్లఘించుటయే! కాని, యితర మార్గములతో నీ కొరతను బూరించికొనుట కా రాజా లెంతయో బ్రయత్నించిరి.

సముద్ర సంబంధము రాజుల రాజకీయ ప్రాధాన్యమునకు గుర్తు. అది వారి గౌరవము. ప్రాచీన హిందూరాజు లందరును దమ సామ్రాజ్యముల నొక సముద్రమునుండి మరి యొక సముద్రమునకు వ్యాపింపజేయుటొక మహా యత్నముగ నెంచిరి. తాము సముద్రాధీశ్వరులమని మురిసిపోవుట వారికి జిరాకాంక్ష. ఆ కాంక్షను విజయనగర సార్వభౌములంత సార్ధకముగ దీర్చికొన్న రాజు దక్షిణదేశ చరిత్రలో మరియొక్కడు లేడు. వారు "పూర్వ పశ్చిమ దక్షిణ సముద్రాధీశ్వరుల" మని తమ శాసనములతో వ్రాసికొనిరి. ఈ వ్రాత కేవల కావ్యోక్తిగాదు. స్వభావోక్తిలో స్వభావోక్తి; దాని యర్ధమును వారు నూటికి నూరుపాళ్ళు సాధించి-తమ చక్రవర్తి పదమునకు వన్నె దిద్దికొన్నారు.

శాసనములలోని బిరుదములను సాధారణముగ 'యివి వారి యత్ప్రేక్షలు లెమ్మని' ద్రోసివేయుట వాడుక. కాని, విద్యానగర రాజుల విషయమున మాత్రమట్లు భావించుటకు వీలులేదు. వారి సామ్రాజ్యపు బొలిమేరలు మూడు సముద్రములని కన్నులతో జూచిన 'యబ్దుల్‌రజాక్' వ్రాసినాడు. ఈ దృష్టితో జూచినచో విజయనగర రాజుల బిరుదములను వాడుకొనుటలో గూడా ప్రాచీనాచార్యుల హితసూక్తి ననుసరించి-సార్థకముగ వాడికొనిరనియే మన మూహింపవలెను.

తమ పట్టణ సౌందర్యమునుగూర్చి యా రాజుల కెంతమో హుమ్మస్సు: ఆ ప్రజలకుగూడ. ఆ మహాపట్టణమును నాటి కవులు-పండితులు-వాయార వర్ణించిరి. నాడుభారత దేశమునకు వచ్చి కన్నులతో జూచి వ్రాసిన రాయబారుల వ్రాతలే లేకున్నచో-నివియన్నియు సంప్రదాయబద్ధమైన యలంకారములని ప్రక్కకు నెట్టియుందుము. కాని-వారి వ్రాతలతో పరప్రత్యయనేబుద్ధులైన మన కథ యెట్లున్నను ఆ పట్టణమున కన్యాయము దప్పినది.

1379లోని యొకానొక శాసనము విజయనగరము నిట్లు గీర్తించినది, "అయోధ్యా నగర మధ్యమున శ్రీరామచంద్రుడు వసించినట్లు విజయనగరమున హరిహరుడున్నాడు. హేమకూటమే దాని ప్రాకారము. తుంగభద్రా నదీమతల్లి యా మహాపట్టణమునకు గందకము. మూడు లోకములను బాలించు శ్రీవిరూపాక్షుడే దానికి రక్షకుడు. ఆ మహానగరమును బాలించు 'రారాజు' రాజమనోహరుడు హరిహరుడు. దానిని వర్ణించుటకు మాటలుచాలవు." "ఈ పట్టణము రెండవ స్వర్గమువలె నున్నది" యని 'వర్తిమా' పల్కులు. "ఇట్టి పట్టణము నెవ్వరునుగని యుండరు, విని యుండరు. దీనితో సరితూగు నగర మీ భూమండలమున లే "దని యబ్దుల్‌రజాక్ వ్రాసినాడు. విద్యానగర స్వరూపము గూడా బ్రాచీనాచార్యుల మతానుసారమే యుండెను శుక్రుని మతమున నొక పట్టణ మర్ధచంద్రాకారముగ నుండవచ్చును. ఈ రెండునూ గానిచో "చచ్చౌకమున" నుండవలెను. 'సీజర్‌ఫ్రెడరిక్', 'రజాక్' యిర్వురునుగూడా–నా మహా పట్టణము వలయాకారముగానే యుండెనని సాక్ష్యమిచ్చినారు.

ఆ రాజధాని విదేశీయుల కనుల జిగేలుమనిపించింది. దానిచుట్టును రక్షణ సాధనము లెన్నియో యుండెను. ప్రతి మహద్వారముకడ నొక దేవతను బ్రతిష్టించి యుండిరి. నాడు ప్రతి గ్రామమున కొక్కొక్క 'గ్రామదేవత' యుండెడిది. మరి విజయనగరమున కెట్లు లేకపోవును? ఆ మహానగరము యొక్క రక్షణాధిదైవము–'రణ మండల భైరవుడు'. స్వామికి గృష్ణదేవరాయలొక దేవళమును నిర్మించెను. మండపమును గట్టెను. గ్రామదేవత నేర్పాటు చేసినంతమాత్రమున నిక సర్వము నాతడే జూచుకొనును, మాకేమి లెమ్మని యా రాజులు–ప్రజలు చేతులు ముడిచికొని కూర్చుండలేదు. సాహసశౌర్యములతో దమధనమాన ప్రాణము లొసగి యా మహాపట్టణమును సంరక్షించికొనిరి. రణ మండల భైరవస్వామి వారి యుత్సాహమునకు బ్రతీకము; వారి త్యాగమునకు బ్రతీకము.

ఆ పట్టణము చుట్టు నొక్క కీకారణ్య ముండెడిది. సాధారణముగ నా ప్రాంతము లన్నియు నట్టివే! ఎంత ధైర్యమున్నను పరసైన్యము లా యడవులలో బ్రవేశించుటకు జంకుచుండెడివి. వానిని దాటి వచ్చినచో – మరియొక బ్రహ్మాండమైన ప్రహరి. దాని చుట్టును నుమా రేబది గజముల వైశాల్యము గల పెద్దబయలు. దానినిండా బృహత్తనువులతో – మృత్యు దూతలవలె గన్పించెడు లెక్క లేనన్ని పంగలరాళ్లు, హయములు వానిని దాటుటయే గష్టము.

'ఫెరిస్తా' వ్రాసిన వ్రాత యిది; "ఆ మహాపట్టణమున కేడు కోటలున్నవి. అవి యొక దానిలో నొకటి యుండెను. మొదటికోటను దాటి లోన బ్రవేశించినచో–విశాలమైన మైదానము. దాని పొడవు సుమారు రేబది గజములు, దానిలో మనుష్యుని యెత్తుగల నిలువురాళ్ళొక దాని కొకటి దగ్గర దగ్గరగా–వ క్రాకృతిగ బాతబడి యున్నవి. సుమారర్ధము వరకు నా శిలలు భూమిలోనికి జొచ్చికొని యుండును. కాలినడకతో గాని–గుఱ్ఱముపై గాని యెంత సాహసమున్నను సులభముగా నా మైదానముప బ్రయాణించుట గష్టము". దీని తరువాత 'నబ్దుల్‌రజాక్' చెప్పిన శిలామయమైన ప్రాకారము లున్నవి. అవి యొక దానిలో నొకటి

చుట్టుకొని యుండెను. ఒక్కొక్క దానికిని సింహము వలె నిల్చి పోరజూచుచున్న బురుజులు పగలు రాత్రులు–జనులతో–గిటికిటలాడుచున్న ఈ మహాపట్టణమునకట్టికోటలేదు. మొదటి ప్రాకారమున దుర్గపాలకులుందురు. వారు సహస్రాక్షులు, అనిమిషులు. అబ్దుల్‌రజాక్ వ్రాత యిది; "మొదటికోట వర్తులాకారము. ఇది యొక పర్వత శిఖరముపై గట్టబడినది. శిలలు – సున్నము –వీనితో దాని నిర్మాణము. దాని ద్వారములు విశాలములు. బలమైనవి, ఎత్తైనవి. ఇరువదినాల్గు గంటలును దుర్గపాలకు లచ్చట గాపుందురు. పట్టణమున బ్రవేశించు నీగ గూడా వారి చూపును దప్పించుకొనలేదు. 'అబ్దుల్‌రజాక్' తన యనుభవము నిట్లు దెలిపి నాడు: ఒక పెద్ద ప్రాకారమున్నది. దాని తర్వాత నొక ప్రతీహారము. 'గోవా'నుండి వచ్చువారీ మార్గముననే పురములోనికి ప్రవేశించవలెను. విజయనగరము బడమటి దిక్కు కనుక ద్వారమదే! వెంటనే యొక బ్రహ్మాండమైన పట్టణము. దాని చుట్టును కోటలు, బురుజులు, మహాకాయములైన తాళ్వారములతోడి ద్వారములు గల యీకోటలవంటివానిని నే నెక్కడను జాడలేదు. ఆ సాలముల నిండ నిగనిగని సున్నముతో దాపీపని యొనర్పబడిన పట్టణవీథులు విశాలములై సూత్రపట్టినట్లున్నవి. వీథుల కిరవైపుల సోయగముగల యిండ్ల వరుసలు. వాని పైకప్పులు చదునైనవి.

"పడమటికోట నుండి తూర్పు కోటకున్న దూరము సుమారేడుమైళ్ళు. ఉత్తర ద్వారమును వీడి దక్షిణద్వామునకు గూడానంతే! మూడవ కోటవాకిలి ముందున్న వానికంటే నెత్తయినది. దానిని దాటిన వెంటనే జంగాళమై సుందరమైన బజారెదుట నిల్చును. అటు తరువాత మరియొక కోట, ఆపై మరియొక వరణము. ఇంతకు నీపట్టణమునకు లోపలిభాగమున మూడు కోటలున్నవి. దాని పిదప రాజసౌధములు. మూడు కోట లొక దానినొకటి చక్రాకారమున జుట్టికొనియుండును. "మొదటి మూడు కోటలలో ౦గనులు, మనము దనియించు పొలములు, నెత్తావులు నుస్వనోయు తోటలు, కొన్ని యిండ్లు. మూడవ కోట దాటినదే యంగడులారంభము. లక్ష్మీలలిత లాస్యవిన్యాసాలయములు, విఫణి వీధు లేడవ కోటవరకు. ఆ వీథులలో నిసుక వేసిన రాలని జనము. రాజసౌధముల కెదురుగ నాలుగు రాజమార్గములుండెడివి. వాని కడ్డముగ మరి నాలుగు. నడుమ మనోహరములైన చత్వరములు".

'ఫైయస్' గావించిన వర్ణనమిది. "ఈ యావరణముల చుట్టును సుందరములైన సమతలములున్నవి. మనస్సున కుల్లాసముగలిగించు లోయలును. ఈ సమతలములలో ధాన్యము బండుచుండెను. కనుచూపుమేర మామిడితోటలు, నిమ్మతోటలు, దబ్బచెట్లు మొదటి కోటకును పట్టణమునకును నడుమ జాలదూరమున్నది. దారిపొడవునను జల్లగాలి కల్లన నూగిసలాడు వరిపొలములు. వానికాల్వలు. దండిగబాఉ నీరు. ఈ పొలములకు నీరు రెండు పెద్ద మడుగులనుండి సరఫరా యగుచుండెను. పెద్దచట్రాతి తూముల నుండి యవి ప్రవహించి– మొదటి కోటదాటి పొలములనడుమ ఫలశలంటు సురభిళములైన తోటలు. నారికేళములు, తాటిచెట్లు–నడుమ నక్కడక్కడనిండ్లు."

ఇతడే మొదటి కోటనుండి పట్టణమునకు బ్రవేశించుమార్గమును మరియొకయెడ నిట్లు వివరించెను; "పిదప–మొదటి ప్రాకారము వచ్చును. మొదటి ప్రాకారమునకు వచ్చుటకున్న మార్గమున కొంత నీరున్నది. దానిని దాటి రావలెను. కొంతదూరమేగి యాకోట మలుపు దిరుగును. మలుపులో గోటవాకిలి గలదు. దాని కిరువైపుల రెండు బురుజులు; ఆ బురుజులతో నా దృశ్యము కంటికింపుగ గంభీరముగనుపించును. ద్వారమును దాటిన వెంటనే రెండు పెద్ద దేవళములు వచ్చును. వానిలో నొకదానికి బ్రత్యేకముగ బ్రాకారమున్నది. ప్రాకారమున సుశీతలచ్ఛాయా భరితములైన వృక్షములు. రెండవ దేవళము నిండ సుందరములైన గృహములు. ఆ బజారుదాటిన వేరొక కోట అక్కడనుండి రాజసౌధములు మనకు గనిపించును. వివరములైన రాజమార్గములు. సర్వసమృద్ధములైన మేడలు. సామంతుల గృహాలు. ధనికుల యిండ్లు. మర్యాదస్థుల కాపురములు, ఆ యిండ్లన్నియు మనోహర శిల్ప విరాజితములు."

విదేశరాయబారియైన 'ఫైయస్' వర్ణనముతో గలిసి–గంగాదేవి రచనము నొక్కసారి జదువుకొన్నచో–విజయనగర స్వరూపమింకను స్పష్టముగ భాసించును. ఆమె వర్ణన మిట్లున్నది; "విజయార్జిత సంపదుడైన బుక్కరాజునకు శుక్రున కమరావతివలె విజయనగరము ముఖ్యపట్టణము. అమరగంగ యమరావతికి పరిఖయైనది, తనకా సౌభాగ్యమేల లేకపోవలయునవి తుంగభద్ర విజయనగరమునకు పరిఖాకారమును ధరించినది. ఆ పట్టణ ప్రాకారములను లక్ష్మీలతాలవాలము. క్ష్మావధూనాభిశోభి, చక్రాచల ప్రకారము విజయనగరము నందలి గోపురములు సుమేరు శృంగసంకాశములై–స్ఫురన్మణి ప్రభలతో–పురాహూత శణసనముల నాహ్వానించుచుండెడివి. ఆయారామములుత్ఫుల్ల చంపకాశోక నాగ కేసర కేసరములు. అట్టి యారామములా పట్టణమున నెచ్చటజూచిన నున్నవి, నగరమునందలి కేళిపర్వతములు, మనోభవమహాదుర్గములు. వానిలో నేడాకు లరటిచెట్లు విచ్చలవిడిగ బూచియుండును. వాని నీడలలో సేదతీర్చుకొనుచున్న కస్తూరి జింకల పొక్కిళ్లు పొట్టలు విచ్చికొని, గప్పుమని వాసనలు వెదజల్లును. క్రీడా సరస్సులు మణిసోపాన మంజులములు. కమలామోద మధురములు. కలకంసకులాకులములు. పట్టణము నందలి సౌధములు శరదంభోజపాండురములు, ఇతర నగరములన్నిటిని జయించి యాకీర్తినంతయుదెచ్చి కుప్పవోసి నట్లువియుండెను. విజయనగరము – వికసద్వనితావల్లీ విలాసవనవాటిక. దక్షిణాశాసరోజాక్షీఫాలలీలా సలలాటిక. ద్విజరాజ సముల్లాస సమునితమైన యచ్చోటగలకాలము నిండుపున్నమయే! అది గంధర్వగణసాన్నిధ్య నవ్యదివ్యవరూధిని. భుజంగ సంఘసంవాసన భూతేశముకుటస్థలి. సుమనస్తోమ సంచార సువర్ణగిరి మేఖల. ఆ మహపట్టణము దిప్తి వృద్ధి లీలావిలాసము. సకల సంపదలకు శాల, సర్వరత్నముల కది మాల, సుకృతాంబుధులకు వేల, దాని సౌధములాకాశము నంటెడివి. మార్తాండమండల మాహర్మ్యముల శృంగములయందా లగ్నమై సువర్ణ కలశ భ్రమను గల్గించుచుండును, చంద్రశాలలో మృగేక్షణాలు గొండ్లిసలుపుచు – ముకాకందుక శంకతో శశాంకుని

బట్టుకొందురు. సంగీతమృదంగ వాదములకు బ్రతిధ్వనులీను సౌధములలో నకాల వర్షాశంకతో మయూరము నర్తించును. ఆ ప్రాసాదములు-పద్మ రాగోపలోత్కీర్ణములు వాని సమీపమున బారాడుచున్న వరాహకములు దత్కాంతులతో శబలితములైన - సంధ్యాకాలంశకను గల్గించును. ఆ సౌధజాలికల నుండి నంజలలో బయలు వెడలు ధూమములు-సౌధాంతర్భాగ ప్రదీపికాలోకములకు భయపడి పరువెత్తిపోవుచున్న చీకటులను భ్రాంతిని గల్పించును. విజయనగరము నందలి బావులు- మాణిక్యమయ సోపానములు గలిగియుండెను. అందుచేత జక్రవాకముల కాయూర రాత్రులయందును విరహము లేదు. ఆ స్త్రీలమిత లావణ్యవతులు. ఆ మొగమందము చంద్రునకు రాలేదు. అతడందుకై యెంతయో యత్నించి కృతకృత్యుడు గాలేదు. హృదయవ్యథయే' యాతనిలోని నలుపు. ఆ స్త్రీల కటాక్షములు యువకుల హృదయములను హరించెడివి. అందుచే బంచసాయకుడు పుష్పాస్త్రముల యందు గల మమతను వదలెను. మంజుమంజీర శింజితాకృష్ణమానసములైన మరాళములు- వారి లీలాగతి ననుసరించుటకు వోలె- యా స్త్రీల సేవలు సల్పెడివి. అంబరము వారి యవలగ్నములను బోలయత్నించు. అందుచే నయ్యది వారికి విమతమైనది. ఆ స్త్రీలుపయోధరోత్సేధములతో నా యాకాశము నడ్డగించి పగదీర్చికొనిరి. ఆ పట్టణమున గాఠిన్యము కామినీమణుల యెదయందే కౌటిల్యము కబరీ భరములందే. కార్శ్యము వారి నడుములో మాత్రమే గనుపించును."

పై మధురా దేవి వర్ణనలో కొన్నియుత్ప్రేక్షలను వదిలి రాయబారుల వ్రాతలతో బోల్చినచో - నామెచెప్పినది చాల మట్టుకు నిజమనిపించును. 'డ్యూయెట్ బర్‌బోసా' వ్రాత యిది. "ఈ కొండలనుండి సుమారు నలబదిమైళ్ళు నడిచినచో విజయనగరము వచ్చును. ఇది జనబహుళము. ఒకవైపున బ్రహ్మాండమైన ప్రాకారము. వేరొకవైపు నొకనది. మూడవప్రక్క యొత్తైయినకొండ. ఈ పట్టణము సమతల మందున్నది. నరసింహు డెప్పుడిచ్చట నుండును. అతడు చాల సజ్జనుడు. నరసింహుని సౌధము లున్నతములు. విశాలములు. అట్టి సౌధములాతని కెన్నియో గలవు. కొల్వుకూటములు లెక్కలేదు. సరస్సులు చేపలతో నిండి యుండెను. ఉద్యానవనములకు లెక్కలేదు. కంటికింపైన పూవులు. సురభిళములైన పొదలు."

ఈనాటి హంపి యొక కుగ్రామము. ఎచ్చటజూచినను రాళ్ళు-గుండ్లు. ఈ ప్రదేశము నాడంతటి వైభవమున కాకరమై యుండెనన్నచో నమ్ముట గష్టమే! కాని ఈ చోటే నాడు 'జన సంకులమై సౌందర్య నిలయమై యుండె'నని 'వర్తిమా' యనెను. అతని డైరీలో దీక్రింది భాగము: "ఇచ్చట సాగు వ్యాపారములకు మితిలేదు. ఈ భూమి చాల సారవంతమైనది. ఈ పట్టణమున మనుష్యుడెంత సాధింపగలడో యంత నాగరికత-సంస్కృతి గూడు కొని యున్నది."

విజయనగర సంపదలలో గొంత కప్పముల మూలమున సామంతు లొసగినది, కానీ యందులో జాలభాగము చక్రవర్తికి బ్రజలు సంపాదించి పెట్టినదే! వారు కార్యశూరులు, అమితోత్సాహులు. తమ భూములను సర్వసమృద్ధము లొనర్చుకొనుటకై వారెన్ని పాటులైనను

పడిరి. విదేశ వ్యాపారములు విరివిగా సాగించిరి. విజయనగర సార్వభౌములలో గృష్ణరాయుడు రేఖాశాలి. అతని కాల మా చరిత్రలో సువర్ణయుగము. కాని, యంతకు జాలకాలమునకుముందే విద్యానగరము వైభవమునకు-సౌందర్యమునకు వాసికెక్కెను. 1375 నాటికే దాని యందముల దిక్కుల కెగ(బ్రాకినవి. రాజులు-జనులు విజయనగరము జూడ నువ్విళ్ళూరుచుండిరి. 'గుల్‌బర్గా' నేలుచుండిన "సుల్తాన్ ముజాహిద్" 1375లో దానా పట్టణమును దర్శింపవలెనని కోరెను. విజయనగరమున కుత్తరమున నున్న సుల్తాన్‌లు గూడా దాని వైభవమునకు గారణము. వా రేటేట దమ కప్పములతో నా చక్రవర్తి భండారమును నింపుచు వచ్చిరి. ఇబ్రహీం ఆదిల్‌షా' సంవత్సరమునకిరువది లక్షల దీనారముల నొసగెడువాడు. ఇదిగాక బహుమతుల మూలమున నందెడు ధనమునకు లెక్కలేదు. ఆ సామ్రాజ్యప్రజలు-రాజులు అంత ధనమును గూడబెట్టుటకు మరియొక కారణము గూడా నున్నది. రాజ్యములోని గనులు వారికి సమృద్ధమగు బంగారమీనుచుండెను. నవరత్నములు కుప్పలు పడుచుండెను. ఆ రాజ్యమున గనులెన్ని యుండెనో-వాని రాబడి యెంతయో-నికరముగ దెలిసికొనుటకు మనకిప్పు డాధారములు లేవు. కాని, వారికి గనుల నుపయోగపఱచికొనుట చక్కగదెలియును. రత్న శాస్త్రమున వారు నిష్ణాతులు. ప్రాచీనాచార్యులు పట్టణ నిర్మాణము పర్వత సమీపముననే జరుగవలెననుటకు ఖనిజముల సంపాదించు టొక కారణమై యుండును. కొండలు-పర్వతములు రత్నముల కాకరములని వారి నిశ్చయము. కాని - విద్యానగర సంపద యంతయు నాచుట్టుపక్కలనున్న 'సాందూరు' కొండలవంటి వాని నుండియే సంపాదించినది గాదు. సామ్రాజ్యము నన్ని కడలనుండి సేకరించి-భండారములు నింపికొనెడివారు.

"సీజర్ ఫ్రెడరిక్" యిట్లు వ్రాసెను: "విజయనగర రాజులకు రత్నములు లభించు ప్రదేశ మొక్కటున్నది. రాజధాని నుండి యచ్చటికి కారు రోజుల ప్రయాణము. నేనచటికి వెళ్ళలేదు. అచ్చటజుట్టును నొక బలిష్ఠమైన ప్రాకారము గట్టినారని వినికిడి. ఆభూమిలో నెంత లోతునకు త్రవ్విన నెట్టి రత్నములు జిక్కునో-యా విద్యవారికి బాగుగాదెలియును."

సలకము తిమ్మరాజు రాజధాని యందున్న రత్నముల నెన్నిటినో మనస్ఫూర్తిగా నాశనమొనర్చెను. అంత జరిగినను దాని వజ్రవైఢూర్యములు దరుగలేదు. సంపద బీరువోలేదు. దారుణమైన యా సంఘటనయిట్లు జరిగినది. "రామరాజు సలకము తిమ్మనికెదురు దిరిగెను. ఆతనికి బాసట మరికొందఱుమండలాధిపతులు. సలకము తిమ్మరాజున కేమి జేయుటకు బాలుపోలేదు. వాడు 'ఇబ్రహీం ఆదిల్‌షా'ను శరణు వేడెను. పాదుషాకు రొట్టె విఱిగి నేతిలో బడినది. వాడంగీకరించి వచ్చుచుండెను. ఈ వార్త రామరాయలకుదెలిసి-తానికదిరుగ బడననియు; 'నాదిల్‌షా'ను వెనుకకు బంపుటుచితమనియు చెప్పి పుచ్చెను. సలకము తిమ్మడామాటలనమ్మి సుంతానుకు గొంతధనమొసగి వెనుక కంపెను. వాడు గృష్ణ దాటిననో లేదో-రామరాయలు సైన్యములతో రాజధాని నడ్డగించినాడు. సలకము తిమ్మయ్య యచ్యుత రాయని కుమారుని జంపి-గద్దె నాక్రమించికొనెను. ఆ పగ దీర్చికొనవలెనని యళియ

రామరాయల పట్టుదల. ఇకదిమ్మయ్య కేమియు దోచలేదు. సింహాసనము తనకు దక్కక పోవునను నిరాశతో–వానికి బిచ్చియెత్తినది. కోటవాకిండ్లు మూసి వేయించినాడు. ఉన్మాదియైన వాడుకోటలోనున్న గజములకు గన్నులు బొడిచెను, గుఱ్ఱముల తోకలు కత్తిరించినాడు. తానెట్లును నాశనమై పోవుచున్నాడు గనుక దనతోబాటు సామ్రాజ్యమునకు రూపనామములు లేకపోవలెనని వాని ప్రతిహింసాభావము. రాజభండారమున ననేక జాతుల మేలి వజ్రములుండెను. వాని నెల యింతని చెప్పినవాడే లేడు! సలకము తిమ్మడారత్నస్తోమముల నా పెద్ద రాతి తిరుగళులలో వేసి–విసరించెను. ఆ రత్న రేణువులను భూమిపై బారజల్లినాడు. రత్న రేణుధూసరితమైన యా భూమి–ప్రణయకుపితయై, చాపకట్టుగ బండుకొన్న రాజమహిషివలె నుండెను. వాని పని దీరినది. రాజసౌధమునందలి యొక స్తంభమునకు బాకు దిగగ్రుచ్చి బలముగ వాడు దానిపైబడెను. అది వాని వీపున దూసికొన్నది. సలకము తిమ్మయ్య జీవితమంతరించెను. కోట వాకిండ్లు దెరువబడినవి. రామరాయులు పట్టణమున బ్రవేశించినాడు.”

సామ్రాజ్య సంపద నభివృద్ధి యొనర్చుటలో గొంత భాగము విదేశీవ్యాపారులకు గద్దు. ప్రపంచమున నన్ని కడలనుండి వ్యాపారులచ్చట గుమిగూడుచుండిరి. నానా దేశాగతుల యాచారవిశేషములు నాకారేంగితముల విద్యానగర ప్రజకు జక్కగా దెలియును. విద్యానగరమున ముఖ్యముగ రత్నముల వ్యాపార మెక్కువ అందునను నిగనిగని వజ్రముల వ్యాపారము. ఆ జనులెంతయో సజ్జనులు. సకల మతములను–జాతులను–వారు సానుభూతితో బ్రేమించి–గౌరవించుచుండిరి. ఏ దేశము వారైన నచ్చట సుఖముగ జీవింపవచ్చును. వారికి సామాజికముగ నేకొఱతయు నుండదు. సుఖమయమైన వారి జీవితసరస్సునందు గాల పురుషుడు విషము గలిపెను. ఆ విషమే ‘రక్షస్తంగాళి’ యుద్ధము. దీనినే గొందరు ‘తల్లికోట’ యుద్ధమని తప్పుగా బిల్తురు. 1565వ సంవత్సరము, జనవరి 25వ తేదినాడు మతోన్మాదితులైన తురుష్కులందరొక్కటై–హిందూ చక్రవర్తిపై విఱుచుకొని పడిరి. ఆ యుద్ధమెన్నడు జరిగినదనుటలో వివాదములున్నవి. ‘సీవెల్’ జనవరి23 అనియు, నాడు మంగళవారమనియు వ్రాసెను. “రామరాయనభభైరు” లో –1564 మే మొదటి తేదీయని యున్నది.

‘రక్షస్తగ్ధి’ యుద్ధము దక్షిణ దేశ చరిత్రనే మార్చివేసినది. దానినుండి గల్గిన దుష్ఫలితముల నన్నిటినిచ్చుటదడవబనిలేదు. కాని, ఈ సమయమున నొక చిన్న యాక్షేపణకు మాత్ర ముత్తరము చెప్పకపోవుటన్యాయము. ఈ యుద్ధవిజయము మహమ్మదీయ చరిత్రకారులు గోరంతలు కొండంతలు వర్ణించికొనిరి. తక్కినవారును– రామరాయల సైనికుల పిరికితనమే యోటమికి గారణమని తేల్చివేసినారు. ‘బళ్ళారి గెజిటీరు’లో ‘ఫ్రాన్సిస్’ మహాశయుడిట్లు వ్రాసెను. “చక్రవర్తి తమ్మువదిలిపోయెను. సేనాధిపతులు బర్వెత్తిరి. సైన్యములు చెల్లాచెదరైనవి. హతాశులైన జనులాత్మరక్షణకై–యే ప్రయత్నము నొనర్పలేదు. సమరము జరిగిన మఱునాడే పట్టణముపై

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Marapurani+Madhuragatha**

* * *